పోగొట్టుకున్న ఫోన్ అందజేత

సిర్పూర్(టి), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలానికి చెందిన గాడె విష్ణు మొబైల్ పోగొట్టుకుని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అప్‌లోడ్ చేయగా సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ మొబైల్ ఫోన్ కనుగొని మంగళవారం బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోయినా, చోరీకి గురైనా సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇలా ఫిర్యాదు చేస్తే గుర్తించే అవకాశం ఉందని తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత

చింతలమానేపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన లెండుగురె వసంత్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా దహన సంస్కారాలకు కొంత మంది దాతలు 6,500 రూపాయలు సేకరించి అందజేశారు. ఎస్ఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు గర్లే శ్రీనివాస్, పూలే సేవా సమితి అధ్యక్షుడు మోర్లె తిరుపతిలు సోషల్ మీడి యాలో పోస్టు చేయడంతో దాతలు ముందుకు వచ్చి సహకరించారు. దాతల సహకారంతో సేకరించిన వివరాలను పూలే సేవా సమితి బాధిత కుటుంబానికి రూ.21,361 అందజేశారు. దాతలు స్పందించి బాధిత కుటుంబానికి సాయం అందించాలని కోరారు. కార్యక్ర మంలో సభ్యులు అర్జున్, బాపురావు, పాండురంగ్, ముక్తేశ్వర్, హనుమంతు, సంతోష్, శ్రీనివాస్, సాయికిరణ్, ధనుంజయ్, చంద్రు, లక్ష్మణ్, సంతోష్, జనార్దన్, రాజు, నాగేష్, శంకర్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పారిశుధ్య జోన్లు



- పంచాయతీల్లో స్వచ్ఛతను పెంపొందించేందుకు ప్రణాళిక
- గృహాలు, విస్తీర్ణం, కార్మికుల సంఖ్య ఆధారంగా నిర్ణయం
- జిల్లాలో 905 ఏర్పాటుకు చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛదనం-పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం కొత్త కార్యాచరణ చేపట్టింది. ఇంటింటికీ చెత్త సేకరణ ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ, మురుగు కాలువలు రహదారుల శుభ్రతను మెరుగు పర్చేందుకు కొత్త ప్రణాళికలు అమలు చేస్తోంది. పంచాయతీల్లో పారిశుధ్య సమస్య పెరిగిపోవడం, సరిపడా కార్మికులు లేక పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదని గుర్తించిన ప్రభుత్వం పారిశుధ్య జోన్లను తెరపైకి తెచ్చింది. ప్రతి గ్రామాన్ని నివాస గృహాలు విస్తీర్ణం కార్మికుల సంఖ్యను బట్టి పారిశుధ్య జోన్లను విభజించారు. చిన్న పంచాయతీలైతే కనిష్ఠంగా రెండు జోన్లు, పెద్ద పంచాయతీలైతే గరిష్ఠంగా నాలుగు జోన్లను ఏర్పాటు చేశారు. ఈ కొత్త విధానంతో గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు మరింత మెరుగు పడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

335 పంచాయతీల పరిధిలో..

జిల్లాలో 335 గ్రామ పంచాయతీల పరిధిలో 905 జోన్లను ఏర్పాటు చేశారు. పంచా యతీల్లో జోన్లను సూచిస్తూ పారిశుధ్య మ్యాప్‌ను ఏర్పాటు చేయాలి. జోన్ల పరిధిలోని నివాస గృహాలు, మురుగు కాలువలు, సీసీ రోడ్ల పొడవు, ఖాళీ స్థలాలను మ్యాప్‌లో ప్రదర్శించాలి. షెడ్యూల్ ప్రకారం ఒక జోన్ పరిధిలో కార్మికులతో పారిశుధ్య సమస్యలను పరిష్కరించి మరుసటి రోజు మరోజోన్ పనులు ప్రారంభించనున్నారు. చక్రీయ పద్ధతిలోల మళ్లీ అదే జోన్లతో పారిశుధ్య పనులు చేపట్టేలా ప్రణాళికలు రుపొందించారు. రోజు వారి పారిశుధ్య నివేదికను యాప్‌లో నమోదు చేయనున్నారు.

పంచాయతీల్లో సేకరించిన..

పంచాయతీల్లో సేకరించిన వ్యర్థాలలో సగటున 300 గ్రాముల తడి పొడి చెత్త ఉంటుందని అంచనా వేస్తున్నారు. డంపింగ్ యార్డుల్లో తడిచెత్తతో సేంద్రీయ ఎరువులను తయారు చేసి నర్సరీల్లో మొక్కల పెంపకానికి వినియోగించడంతో పాటు ఇతరులకు విక్రయించనున్నారు. పొడి చెత్తను తుక్కు దుకాణ నిర్వహకులకు విక్రయించి వచ్చిన డబ్బులను జనరల్ ఫండ్‌కు జమ చేయాలని ఆదేశించారు. ఇందు కోసం ప్రత్యే రిజిస్టర్‌ను నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియను ఎంపీవో, డీఎల్‌పీవో, డీపీవో స్థాయిలో తనిఖీ చేయనున్నారు. ఈ మేరకు పల్లెప్రగతి యాప్‌లో కొత్త ప్రణాళికలను అప్‌డేట్ చేయనున్నారు.

పారిశుధ్యం మెరుగుదలకు..

భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి



పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగు పర్చేందుకు ప్రభుత్వం కొత్త ప్రణాళికలు అమలు చేస్తోంది. దీనిలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్య జోన్లను ఏర్పాటు చే యాలని ఆదేశాలు జారీ చేసింది. గృహాలు, విస్తీర్ణం బట్టి కార్యదర్శులు ప్రతి పంచాయతీలో జోన్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 905 జోన్లను ఏర్పాటు చేశాం.

ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు



మాట్లాడుతున్న కేంద్ర పెట్రోలియం, సహజ వనరులు, గ్యాస్ సంయుక్త కార్యదర్శి వినోద్‌శేషన్

ఆసిఫాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర పెట్రోలియం, సహజ వనరులు, గ్యాస్ సంయుక్త కార్యదర్శి వినోద్‌శేషన్ అన్నారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని గొర్రెగుట్ట, బోర్లకుంట, కోట్మీర్, దహెగాం, హత్తిని తదితర ప్రాంతాలలో కేంద్ర బృందం పర్యటించి జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర పెట్రోలియం, సహజ వనరులు, గ్యాస్ సంయుక్త కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణలోని అసంపూర్తి ప్రాజెక్టులను పరిశీలించి ఆగిపోవడానికి గల కారణాలు, పూర్తి చేయడానికి చేపట్టాల్సిన చర్యలను పరిశీలించి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని కాలువలను పరిశీలించామని చెప్పారు. పూర్తి చేసిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రేమోన్ ఎస్ పిళ్ళై, కేంద్ర భూగర్భ జలవనరుల ఈఈ వేంకటేశ్వర్లు, హెచ్‌ఈ కుమారస్వామి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, డీఈ భానుమూర్తి, ఈఈ ప్రభాకర్, ఏఈలు క్రాంతి, సాయితేజ, తహసీల్దార్ మునావర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పోల్స్ టాక్స్ రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కేబుల్ ఆపరేటర్లు

ఆసిఫాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నూతనంగా అమలు పరుస్తున్న పోల్ టాక్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేప ట్టారు. ఈ సందర్భంగా కేబుల్ టీవీ, ఇంటర్నెట్ ఆపరేటర్ల సంఘం ముఖ్య సలహాదారులు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు లోకేష్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రహెమాన్ మాట్లాడుతూ నూతన పోల్స్ టాక్స్ విధానంతో కేబుల్ ఆపరేటర్లకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కార్పొరేట్ వ్యవస్థలో కేబుల్ ఆపరేటర్లను అప్పుల పాలు అవుతూ జీవనం కొనసాగిస్తున్నారని, నూతన పాలసీల ద్వారా వారు ఆర్థికంగా తీవ్రంగా నష్ట పోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సలహాదారుడు కావేటి మనోహర్, కన్వీనర్ సాజిద్, అశోక్‌గౌడ్, దిలీప్, కిరణ్, స్వప్న, సంపత్, జమీల్ సాయికృష్ణ, నగేష్, చారి, రాజు, సత్యం, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క హామీతో దీక్షల విరమణ



మంత్రి సీతక్కతో ఫోన్ ద్వారా ఆదివాసీ నాయకులతో మాట్లాడిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హామీతో కలెక్టరేట్ ఎదుట 13 రోజులుగా ఆదివాసీ సంఘాల నాయకులు చేపడుతున్న దీక్షలు మంగళవారం విరమించారు. టైగర్‌జోన్‌ను జిల్లాలో రద్దు చేయాలని అటవీ భూముల, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజ్‌గోండ్ సేవా సమితి, జిల్లా రాయి సెంటర్‌ల ఆధ్వ ర్యంలో ఆదివాసీ సంఘాలు 13 రోజులుగా కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు చేపడుతున్నారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే తన ఛాంబర్‌కు మంగళవారం ఆదివాసీ సంఘాల నాయకులను పిలిపించి మంత్రి సీతక్కతో ఫోన్‌లో మాట్లాడించారు. ఈ సందర్భంగా మంత్రి టైగర్‌జోన్ రద్దు కోసం తీర్మానం చేశామని రోడ్లు, అటవీభూముల సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పాఠశాల భవన నిర్మాణానికి అటవీశాఖతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆది వాసీ సంఘాల నాయకులు దీక్షలను విరమించడానికి ఒప్పుకున్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్ రావు నిమ్మరసం అందించి దీక్షలను విరమింపచేశారు. కార్యక్రమంలో సీఐ రవిందర్, ఆదివాసీ సంఘాల నాయకులు సిడాం అర్జు, మడావి శ్రీనివాస్, నర్సింగ్‌రావు, గుణవంత్‌రావు, గంగారాం పాల్గొన్నారు.

జీవో రద్దుకు గిరిజన ఎమ్మెల్యేల తీర్మానం

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన టైగర్‌జోన్ ప్రతిపాదన జీవోను 49ని రద్దు చేయాలని గిరిజన ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ములుగు ఎమ్మెల్యే, మంత్రి సీతక్కతో పాటు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి గిరిజన నియోజక వర్గాల ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అటవీ ప్రాంతాల్లో దశాబ్దాలుగా నివసిస్తూ అడవిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీల జీవనోపాధికి ఈ జీవోతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. టైగర్ జోన్ ఏర్పాటుతో వారిని అడవుల నుంచి వెళ్లగొట్టే కుట్ర జరుగుతుందని చెప్పారు. జీవోను రద్దు చేయాలని, పోడు సాగు చేసుకుంటున్న ఆదివాసీలను అటవీ అధికారులు తరుచుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు టైగర్ జోన్ పేరుతో వారి హక్కులను ఇబ్బందికి గురి చేయవద్దని కోరారు. వివిధ సమస్యలపై చర్చించారు. అందులో కొన్ని ఆసిఫాబాద్‌లో స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు రెగ్యులర్ ఆశ్రమ పాఠశాలలు ప్రారంభించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. కెరమెరి మండలంలో రాజీవ్ యువ వికాసం ఆర్థిక సహాయం కింద లక్ష లోపు సహాయం చాలా తక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారని, తిరిగి అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో ఉప సభాపతి రామచంద్రనాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు నాయక్, అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

జైనూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని సోనుపటేల్‌గూడలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 22 వేల 500 కోట్లతో 4లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల చొప్పున నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగుతుందన్నారు. గత ప్రభుత్వం డబ్బుల్ బెడ్‌రూమ్‌ల పేరుతో పెద ప్రజలకు మోసం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖిద్, ఉపాధ్యక్షుడు పెందొర్ ప్రకాష్, నాయకులు మేస్రం అంబాజీ, కోట్నాక దౌలత్‌రావు, ఆడ అమృత్‌రావు, బాబు పరస్ పాల్గొన్నారు

తొందరపడి రైతులు పత్తి విత్తనాలు పెట్టకూడదు

బెజ్జూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులు తొందర పడి పత్తి విత్తనాలు విత్తుకోవద్దని ఏవో నాగరాజు అన్నారు. పోతపల్లి గ్రామంలో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. కనీసం 6 సెంటీమీటర్ల వర్షపాతం పడిన తరువాతనే పత్తి విత్తనాలు విత్తుకోవాలని చెప్పారు. ఇంకా మనకు అంత మేర వర్షాపాతం నమోదు కాలేదన్నారు. పత్తి విత్తనాలు మూడు నుంచి ఆరు సెంటీమీటర్ల లోతులో మాత్రమే విత్తుకోవాలన్నారు. అనంతరం డీసీఎంఎస్ సెంటర్‌లో రికార్డులను పరిశీలించి రైతులకు యూరియా సరఫరా చేయాలని సూచించారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): రైతులు తొందరపడి విత్తనాలు వేయకూడదని ఏవో గిరీష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. భూమిలో వేడి ఎక్కువగా ఉందని చెప్పారు. భారీ వర్షం పడ్డ తర్వాతే రైతులు విత్తనాలు పెట్టుకోవాలని ఏవో సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఏసీఎంవో ఉద్ధవ్

వాంకిడి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుం దని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. మంగళవారం మండలంలోని చౌప్పనగూడ, చిన్నపుల్లారా, విప్పర్‌గొంది గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గిరి పాఠశాలల నిర్వహణ కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ గిరిజన పాఠశాలల్లో ఉచిత విద్య, భోజన వసతి, ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ, దుస్తులు అందజేస్తున్నామని చెప్పారు. పిల్లలను వ్యవసాయ కూలీ పనులకు పంపించకుండా తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మనోహర్, ఉపాధ్యాయులు రవి, రాజేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని మహిళ నిలదీత

కౌటాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండల తలోడి గ్రామానికి చెందిన అరికెల పద్మ అనే దళిత వితంతు మహిళ అర్హత ఉన్నా తనకు ఇందిరమ్మ ఇల్లు ఎందుకు రాలేదని మంగళవారం ఎంపీడీవో రమేశ్‌ను నిలదీసింది. తనను ఇందిరమ్మ సర్వేలో అధికారులు ఎంపిక చేశారని, కానీ అర్హుల లిస్టులో తన పేరు లేదని చెప్పారు. అయితే దానికి ముందు పలు మార్లు గ్రామ కార్యదర్శి కవిత తనకు ఇల్లు మంజూరు అయిందని త్వరలోనే ముగ్గు వేసి ఇంటి పనులు ప్రారంభిద్దామని చెప్పారని అన్నారు. తీరా మంజూరు లిస్టులో తన పేరు లేక పోవడంతో కుటుంబ సభ్యులతో ఎంపీడీవో కార్యాలయానికి వచ్చినట్లు తెలిపారు. తాను దళిత వితంతు మహిళ అని తనతో పాటు తన వదినలు అరికిల్ల మాధవి, అరికిల్ల రాజేశ్వరిలతో పాటు నలుగురు పిల్లలు కలిసి తడకలతో వేసుకున్న పాకలో ఉంటున్నామని వివరించింది. పక్కా బిల్డింగులు, భవంతులు ఉన్న వారికి ఇళ్లు మంజూరు అయ్యాయని వాపోయింది. ఎలాంటి ఇళ్లు లేని దళిత వితంతువునైన తనకు ఎందుకు మంజూరు కాలేదని ప్రశ్నించింది. ఈ విషయమై ఎంపీడీవో రమేశ్ మాట్లాడుతూ విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పారిశుధ్య కార్మికులకు శిక్షణ

సిర్పూర్(టి), జూన్ 10(ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య పార్ట్ టైం కార్మికులకు మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో టాయి లెట్‌లను శుభ్ర పరుస్తూ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. పాఠశాలలో ఉన్న మొక్కలకు నీరు పోయా లని సూచించారు. పాఠశాలల్లో అపరిశుభ్రత నెలకొనకుండా చూడాలని తెలిపారు. కార్యక్ర మంలో ఆర్పీ సుభాష్, పాల్గొన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

బెజ్జూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. నెలల తరబడి పంచాయతీ చెక్కులు క్లియర్ కాక పోవడం వల్ల సామగ్రి, ట్రాక్టర్ డీజిల్ ఇవ్వడం లేదని చెప్పారు. దీంతో రోజు వారి నిర్వహణ కొరకు సొంత డబ్బులు ఖర్చు పెట్టాల్సి వస్తుందని, తాగునీటి నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, ఇతరాత్ర పనులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

కంకర తేలిన రోడ్డు.. రాకపోకలకు అవస్థలు

దహెగాం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండల కేంద్రం నుంచి లగ్గాం క్రాస్ రోడ్డు వరకు రోడ్డుపై కంకర తేలడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యం మండల కేంద్రానికి పలు అవసరాల నిమిత్తం లగ్గాం, పంబాపూర్, ఒడ్డుగూడ, చిన్నరా స్పెల్లి, గెర్రె, గిరివెల్లి, చంద్రపల్లి, ఖర్జీ, రాంపూర్, మొట్లగూడ, రావులపల్లి, దిగిడతో పాటు పలు గ్రామాల ప్రజలు రాక పోకలు సాగిస్తుంటారు. ఇదే రహదారి మీదుగ ప్రైవేటు వాహనాలతో పాటు మంచిర్యాల ఆర్టీసీ బస్సులు నడుస్తుంటాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాలు తరుచు ప్రమాదాలకు గురవుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలిన దహెగాం- లగ్గాం రోడ్డు

చినుకు లేక చింత

- జిల్లాలో పత్తి విత్తేందుకు దుక్కులు సిద్ధం చేసిన రైతులు
- సరిపడా తడి లేక మొదలు కాని మెట్ట పంటల సాగు



విత్తనాలు పెడుతున్న రైతులు(ఫైల్)

ఆసిఫాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మే నెలలో అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు భూముల్లో దుక్కలు చేసుకుని మెట్ట పంటలకు సిద్ధం చేశారు. కానీ రెండు వారా లుగా జిల్లాలో భారీ వర్షం లేక పోవడంతో పంటలు వేసేందుకు రైతులు జంకుతున్నారు. ఈ నెల మొదటి వారంలోనే నైరుతి రుతుపవనాలు తాకాల్సి ఉన్నా రెండో వారం పూర్తి కావస్తున్నా ఆ ఛాయలే కనిపించడం లేదు. మరో వైపు జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో మెట్ట పంటల సాగుకు రైతులు వేచి చూడక తప్పడం లేదు. జిల్లాలో వ్యవసాయం పూర్తిగా వర్షాధారంపైనే ఆధారపడి ఉంటుంది. గత కొన్ని సంవత్సరాల నుంచి రుతుపవనాలు ఊరించుకుంటూ జూన్ చివర జూలై వరకు భారీ వర్షాలు పడడం లేదు. ఈ ఏడాది మే 20 నుంచి జిల్లాలో వర్షాలు కురిశాయి. దీంతో పాటు రుతుపవనాలు కూడా ముందుగానే వస్తున్నాయని వాతావరణ శాఖ చెప్పడంతో రైతులు ముందుగానే పంటలు వేసుకోవచ్చని సిద్ధం చేసుకున్నారు. ఇదే ఊపులో పలు చోట్ల పత్తి విత్తనాలు కూడా వేశారు. కానీ జిల్లాలో పది రోజుల నుంచి వర్షాలు కురవక పోవడం, ఎండల తీవ్రత పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొడి దుక్కుల్లోనే...

కొన్ని ప్రాంతాల్లో వర్ష సూచన ఆధారంగా పొడి దుక్కుల్లోనే పత్తి విత్తనాలు నాటుతారు. ప్రస్తుతం అలాంటి సూచనలేవి లేకపోవడంతో దుక్కులు దున్నినా విత్తనాలు పెట్టేందుకు రైతులు సాహసించడం లేదు. గత ఏడాది జూన్ మూడో వారంలోగా మెట్ట పంటలు పనులు పూర్తయ్యాయి. కానీ ఈ ఏడాది జూన్ రెండో వారం ప్రారంభమైనా పంటలు వేయలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 4.5 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. అకాల వర్షాల నుంచి పంటలను కాపాడేందుకు ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ముందస్తు సాగు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ముందస్తు పంట కాలానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించగా, నైరుతి రుతుపవనాల ఆలస్యంతో అమలయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. రైతులు తొందరపడి విత్తనాలు పెట్టకూడదని, కనీసం 6 సెంటీమీటర్ల వర్షం పడిన తరువాతే వేయాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు శిక్ష

వాంకిడి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి పది సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.60, రూ.50 వేల జరిమానా విధిస్తూ మంగళవారం జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ తీర్పు వెల్లడించారు. వాంకిడి ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. 2021 జులై 14న వాంకిడి పోలీసు స్టేషన్ పరిధిలో అప్పటి ఎస్సై దీకొండ రమేష్, పోలీసు సిబ్బందితో కలిసి ఖైరి(టి) గ్రామ శివారులో వాహనాల తనిఖీలు చేస్తున్న క్రమంలో ఒక కారులో గంజాయి కనిపించింది. కారు నడుపుతున్న కెరమెరి మండలం ధనోరకు చెందిన ఎండీ గులాబ్ ఖాన్, ఆయన వెంట కాగజ్‌నగర్ మాలినికి చెందిన సూర్వం జింకు కారులో గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు.. దీంతో అప్పటి ఏఎస్సై ఓంపాల్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ సుధాకర్ విచారణ జరిపారు. ప్రస్తుత వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్‌లు సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. పీపీ జగన్మోహన్‌రావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ విచారణ జరపగా నేరం రుజువు కావడంతో గులాబ్‌ఖాన్‌కు పది సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.60 వేల జరిమానా, సూర్వం జింకుకు పది సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు ఎస్సై తెలిపారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పీపీ జగన్మోహన్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ సత్యనారాయణ, ఎస్సై మధుకర్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్, కోర్టు సిబ్బందిని జిల్లా ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ అభినందించారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి

సిర్పూర్(టి), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) రైల్వే స్టేషన్- మాకిడి మధ్య కోయంబత్తూర్‌కు చెందిన భూపతి కరుప సామి (22) గూడ్స్ రైలు నుంచి పడి మృతి చెందినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. కోయంబత్తూరు నుంచి ఫరీదాబాద్ వెళ్లే గూడ్స్ రైలు బండిలో బుల్ కంపెనీ జేసీబీలను ట్రాన్స్‌ఫర్‌గా వెళ్తూ ప్రమాదవ శాత్తు గూడ్స్ రైలు నుంచి పడి మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి బంధువులకు సమాచారం అందజేసి మృతదేహాన్ని కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

భీమారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలో కొత్తగూడెం సమీపం లో మంగళవారం గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు భీమారం ఎస్ఐ శ్వేత తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో ఓ వ్యక్తి అనుమానస్పదంగా కనిపించడంతో అతన్ని తనిఖీ చేయగా తన సంచీలో 100 ప్యాకెట్లు గుడుంబా లభించిందని తెలిపారు. గుడుంబా తరలిస్తున్న కొత్తూరు గ్రామానికి చెందిన ధరావత్ బద్రునాయక్‌పై కేసు నమోదు చేసి గుడుంబా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా గుడుంబా తరలిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

కబ్జాకు గురవుతున్న కాలువలు

పట్టించుకోని అధికారులు



సాముగూడ వద్ద కబ్జాకు గురైన కాలువ

కాసిపేట, జూన్10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపల్లి రాళ్ల వాగు ప్రాజెక్టు కుడికాలువ కబ్జాకు గురైంది. అయినా అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో సామూగూడ నుంచి కోమటి చేను వరకు కాలువ పక్కన ఉన్న రైతులు కాలువను కబ్జా చేసి యథేచ్చగా సాగుచేసుకుంటున్నారు. పదిహేనేళ్ల క్రితం పదికోట్లు ఖర్చు చేసి 1200 ఎకరాలకు నీరందించాలనే లక్ష్యంతో మల్కాపల్లిలో నిర్మించిన రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువ ఏటా కబ్జాకు గురవుతుంది. అధికారులు ఎవరు దీనిని పట్టించుకోవడం లేదు. కాలువలో భూమిని కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేసింది. అయినప్పటికీ యథచ్చేగా అక్రమణలకు పాల్పడి సాగు చేసుకుంటున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులకు స్పందించి ఆక్రమణకు గురవుతున్న కాలువలను కాపాడాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

సాంకేతిక విద్యకు దూరం..



- జిల్లాలో ఏర్పాటుకు నోచుకోని పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు
- ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్న విద్యార్థులు

రెబ్బెన, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యతో అనతి కాలంలోనే ఉద్యోగాలు సాధించే అవకాశాలు ఉండగా, కుమరం భీం జిల్లాలో సాంకేతిక విద్య అందక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అలాగే ఉద్యోగ అవకాశాలు కూడా కోల్పోతున్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన వారికి విపరీతమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. కానీ అన్ని రంగాల్లో వెనుకబడిన జిల్లాలో సాంకేతిక విద్య అందించే ప్రభుత్వ కళాశాలు లేవు. జిల్లాలో కాగజ్‌నగర్ పట్టణంలో ఉన్న ఏకైక ప్రైవేట్ ఐటీఐ కళాశాల ఉంది. జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలు లేక పోవడం విద్యారంగంలో జిల్లా వెనుకబడి తీరుకు నిదర్శంగా నిలుస్తోంది.

● తక్కువ సమయంలోనే..

ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటీఐ) పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా విద్యార్థులు తక్కువ సమయంలోనే ఉద్యోగ అవకాశాలు పొందేందుకు మార్గాలున్నాయి. సాంకేతిక కళాశాలు లేక పోవడంతో ఉన్నత చదువులు చదివే స్తోమత లేక పోవడంతో అంతా నిరాశా చెందుతున్నారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరే వారంతా కూడా బెల్లంపల్లి, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఐటీఐ పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్థానికంగా ఉన్న సింగరేణి సంస్థ వేతనంతో కూడిన శిక్షణ(అప్రెంటిషిఫ్) ఇవ్వడానికి ముందుకు వచ్చింది. ఆర్టీసీ వంటి అనేక సంస్థలు కూడా ఐటీఐ విద్యార్థులకు తమ సంస్థల్లో అవకాశాలు కల్పించేందుకు మొగ్గు చూపుతున్నాయి. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు సొంతంగా పరిశ్రమ పెట్టుకుని స్వయం ఉపాధితో స్థిరపడే అవకాశం ఉన్నందున ఐటీఐ వంటి కోర్సులు చేసేందుకు విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతు న్నారు. వెనుకబడిన జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయటం ద్వారా ఎంతో మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. స్థానికంగా కళాశాలలు లేక పోవటంతో పట్టణాల్లోకెళ్లి చదుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు పేర్కొంటున్నారు. 2024-25 సంవత్సరానికి 6వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష సాధించారు. వారందరికి సాంకేతిక కోర్సుల్లో చేరడానికి అర్హత ఉంది. వీరితో పాటు ఇంటర్ చదివిన విద్యార్థులు సైతం ఈ కోర్సుల్లో చేరడానికి అవకాశం ఉంటుంది. కాగా, ఉమ్మడి జల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, ఉట్నూరు, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నప్పటికీ దూర భారంతో చదివించుకోలేని పరిస్థితి ఏర్పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. వెనుకబడిన జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగనుంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి..

- జగజంపుల తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి



విద్యారంగంలో అత్యంత వెనుకబడి జిల్లాను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సాంకేతిక విద్యను ప్రవేశ పెట్టాలి. ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులు ఎంతగానో విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుంది. అనతి కా లం లోనే ఉద్యోగ అవకాశాలు కూడా వస్తాయి. ఈ దిశగా అధి కారులు, నాయకులు స్పందించి ఈ జిల్లాలో వెం టనే సాంకేతిక విద్యకు సంబంధించిన కళాశాలలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

ఎఫ్ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రెబ్బన ఫారెస్టు నర్సరీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఎఫ్ఎస్‌వో కోమల్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం డీఎఫ్‌వో నీరజ్‌కుమార్‌కు, కలెక్టరేట్ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. రెబ్బెన ఫారెస్టు నర్సరీలో గత సంవత్సరం క్రితం పని చేసిన దానికి సంబంధించిన డబ్బులను అప్పటి ఎఫ్ఎస్‌ఓ కోమల్ వేతనాలు చెల్లించడం లేదని ఎన్ని సార్లు అడిగినా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆమె సస్పెండ్ అయి భూపాలపల్లిలో ఉద్యోగం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే సుమారు రూ.5 లక్షల రావల్సి ఉందని, వెంటనే చెల్లించాలని కోరారు. తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు., కార్యక్రమంలో ఉపేందర్, సతీష్, దశరథం, పెంటయ్య, కవిత, నిర్మల, తార, స్వరూప, చిన్నక్క, సరిత తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

కాగజ్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ ఎం డేవిడ్ అన్నారు. కాగజ్‌నగర్ మండలం గన్నారంలో మంగళవారం ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యల పరిష్కార దిశగా భూ భారతి చట్టం ద్వారా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సదస్సులో అందిన దరఖాస్తులను పరిశీలించి రికార్డులతో సరి చూసి క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి శాశ్వతంగా సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటి పేరు, తండ్రి పేరు, భూమి విస్తీర్ణం హెచ్చుతగ్గులు, ఇతర వివరాల నమోదుపై వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించనున్నామని తెలిపారు. సదస్సులో తహసిల్దార్ మధూకర్, డిప్యూటి తహసిల్దార్ సరిత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టాదారు పుస్తకాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నా మని తహసీల్దార్ భూమేశ్వర్ అన్నారు. కోటారి, కల్లెగాం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సద స్సుల్లో పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు భూ సమస్యల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. డీటీ సంతోష్ సావర్‌ఖేడలో దరఖాస్తులు స్వీకరించారు. క్యాక్రమంలో ఎంపీడీ వో అంజద్‌పాషా, కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మోట్ల గూడ, బోర్లకుంట గ్రామాల్లో రెవెన్యూ అధికారులు భూ భారతి సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. భూ భారతి సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శృతి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

ఎంఈవో శ్రీనివాస్

దహెగాం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. కుంచవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట వండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని చెప్పారు. నాణ్యమైన కూరగాయలు వంటకు వినియోగించాలని ఈ సందర్భంగా ఎంఈవో సూచించారు. సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా వండాలని ఎంఈవో ప్రకాష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన, పారిశుధ్య కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట వండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. నాణ్యమైన కూరగాయలు వంటకు వినియోగించాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తకుండా పరిశుభ్రమైనవే వినియోగించాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థుల యూని ఫాంలు పంపిణీ చేశారు. పాఠశాలల ప్రారంభం రోజే అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్ర శేఖర్, భరత్, శ్యాంరావు, నరేష్, ఆర్పీలు విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

సిర్పూర్(టి), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎరువుల డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని విజి లెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రశాంత్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని పలు ఎరువు ల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటూ లైసెన్సు రద్దు చేస్తామన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువుల అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలని చెప్పారు. నోటీసు బోర్డులపై ధరల వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆయన సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏవో గిరీష్, తదితరులు ఉన్నారు.

ఈదురు గాలులు..వర్షం

ఆసిఫాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్, రెబ్బెన మండలాల్లో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం వరకు పొడిగా ఉన్న వాతావరణం రాత్రి ఒక్కసారిగా ఈదురు గాలులు, ఉరుము మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో అధికారులు కరెంట్ సరఫరా నిలిపివేశారు.

బదిలీపై వెళ్లిన అధికారికి సన్మానం

శ్రీరాంపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్ఈ(ఐఈడీ)గా పనిచేసి బదిలీపై వెళ్లిన కిరణ్ కుమార్‌ను ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ సన్మానించారు. జీఎం కార్యాలయంలో ఆయనను సత్కరించి, సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా, ఎస్‌సీ లైజన్ అధికారిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్స, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) రాజన్న, డీజీఎం(లా) శిరీషారెడ్డి, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, ఏరియా సర్వే అధికారి నర్సింగరావు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, సీహెచ్‌పీ ఇన్‌చార్జి చంద్రలింగం, ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో నూతన గనుల ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న ఐఎన్టీయూసీ నాయకులు

మందమర్రి టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నూతన గనుల ఏర్పాటు లక్ష్యంగా తమ యూనియన్ కృషి చేస్తోందని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు, క్రమశిక్షణ కమిటీచైర్మన్ కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉప్యాక్షుడు దేవి భూమయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నరేందర్ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో త్వరలోనే 19కి పైగా పాత గనులు మూత పడనున్నా యన్నారు. దీని ద్వారా సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం పొంచి ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సెక్రెటరీ జనరల్, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ ప్రభుత్వానికి సింగరేణి పరిస్థితిని వివరించారని తెలిపారు. సింగరేణిలో ఇప్పటికే ప్రకటించిన గనులను వేలం ద్వారా అయినా పాల్గొనాలని, లేనట్లయితే వాటిని సింగరేణికి కేటాయించే విధంగా ఒత్తిడి తేవాలని కోరామన్నారు. కొత్త గనులు రాకపోతే సింగరేణిలో కొలువులు కష్టమని అన్నారు. సలహా మండలి చైర్మన్‌గా నియమితులైన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కోటి 20 లక్షల మంది కాంట్రాక్టు కార్మికులకు పలు ప్రణాళికలు రూపొందించారని, సింగరేణిలో ఐదు వేల లాభాల వాటా చెల్లించే విధంగా చర్యలుచేపట్టారని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల దీర్ఘకాలిక ప్రయోజనాలకు సంబంధించి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరామని, దీనికి ప్రభుత్వం కూడా అంగీకరించిందని తెలిపారు. సమావేశంలో మిట్ట సూర్యనారాయణ, పానుగంటి వెంటకస్వామి, శంకర్‌రావు, కన్నయ్య, బాబు, రాములు, రాయనర్సు, రమేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



టీబీజీకేఎస్ పిట్ కమిటీ ఏర్పాటు



ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ పిట్ కమిటీని ఎస్ఆర్‌పీ 3 గనిలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ హాజరయ్యారు. ఆయన సమక్షంలో పిట్ కార్యదర్శిగా కురుమ వికాస్, సహాయ కార్యదర్శిగా తిరుపతి, షిఫ్ట్ కార్యదర్శులుగా రవిచంద్ర, శ్రీనివాస్, రిలే కార్యదర్శులుగా అరుణ్, సతీష్, రవి, రమేష్, తిరుపతితో పాటు 30 మంది కమిటీని ఎన్నుకున్నారు కార్యక్రమంలో నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజేశం, వెంకటరమణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆసుపత్రి సేవలపై నమ్మకం పోయింది

రామకృష్ణాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆసుపత్రి సేవలపై కార్మికులకు నమ్మకం లేకుండా పోతుందని సీఐటీయూ బ్రాంచి అధ్యక్షులు సాంబారు వెంకటస్వామి అన్నారు. రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిని మంగళవారం సందర్శించిన ఆయన సింగరేణి యాజమాన్యం తీరుపై మండిపడ్డారు. కార్మికులకు సమయానికి మందులు లేక అందుబాటులో వైద్యులు లేక పని చేయని పరికరాలతో నిత్యం కార్మికులకు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోట్ల రూపాయల లాభాలు సంస్థకు అందించేందుకు అహర్నిశలు కష్టపడుతున్న కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం చిన్న చూపుచూడడం సరికాదన్నారు. వెంటనే పూర్తిస్థాయి వైద్యులను నియమించి ఎప్పటికప్పుడు మందులను కొనుగోలు చేసి పరికరాలన్నింటిని అందుబాటులో ఉంచేలా కృషి చేయాలన్నారు. లేకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ట్రెజరర్ వడ్లకొండ ఐలయ్య, వైస్ ప్రెసిడెంట్ అలువాల సంజీవ్, ఆర్గనైజర్ లింగాల రమేశ్, సివిల్ పిట్ సెక్రటరీ రాజకుమార్, కాసిపేట2 అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సురేశ్, విజయ్, కుమార్ పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ వడ్డీ శాతాన్ని తగ్గించడం సరికాదు

మందమర్రి టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణితో పాటు కోల్ ఇండియా కార్మికుల భవిష్య నిధి(సీఎంపీఎఫ్) వడ్డీ శాతాన్ని తగ్గించడం సరికాదని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ మండిపడ్డారు. ఏరియాలోని కేకే 5 గనిని మంగళవారం సందర్శించి కార్మికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జీతం నుండి 12 శాతం రికవరీ అయితే 12 శాతం యాజమాన్యం కలుపుతుందని చెప్పారు. వాటికి వడ్డీ కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.గతంలో 8.5 శాతం ఉన్న వడ్డి 8 శాతం చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మళ్లీ దీనిని 7.6 శాతానికి తగ్గించడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. కార్మికులకు సంబంధించిన భవిష్య నిధి కోత విధించడం సరికాదన్నారు. తప్పనిసరిగా పాత పద్ధతిలోనే వడ్డీ శాతాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి సెక్రెటరీ కంది శ్రీనివాస్, ఏరియా నాయకులు ఎగ్గేటి నాగేశ్వర్‌రావు, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి ప్రేంలాల్, మేకల సంతు, పూదరి శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, పాల్గొన్న ఏరియా నాయకులు

రక్షణ సూత్రాలను పాటించాలి

మందమర్రి జీఎం దేవేందర్

రామకృష్ణాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిపై కార్మికులంతా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. రామకృష్ణాపూర్ సీహెచ్‌పీలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జీఎం మాట్లాడారు. కార్మికులు తప్పని సరిగా రక్షణ సూత్రాలు పాటించాల న్నారు.పనిలో నిబద్ధత ఎంత ఉంటదో రక్షణ కూడ అంతే నిబద్ధతో ఉండాలన్నారు. అండర్‌గ్రౌండ్‌లో పని చేసే కార్మికులు పీపీఈ, ఎస్‌ఓపీతో పొందుపరిచిన విధంగా రక్షణ పరికరాలను ఎల్లప్పుడు వెంటబెట్టుకొని ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. సీహెచ్‌పీ డీజీఎం టీటీఝా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా రీజినల్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఏరియా సేఫ్టీ రవీందర్, ఏజీఎం వెంకటరమణతో పాటు కార్మిక సంఘాల నాయకులుఅ క్బర్ అలీ, లింగయ్య, పిట్ కార్యదర్శి కల్లెపల్లి హరిరామకృష్ణ, జూనియర్ ఇంజనీర్ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టొద్దు

దండేపల్లి జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా)ద్వారా విద్వేషపూరిత వ్యాఖ్యలు రెచ్చగొట్టె పోస్టులు పెడ్డకూడదు, ఇతర మనోభావాలను దెబ్బతీసే విధంగా దుష్పచారం చేసే వ్యక్తులను చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎండి తహసీల్దార్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ కుల, మత ప్రాంతీయ వివాదాలకు తావు ఇచ్చేలా వ్యవహరించకూడదు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు, వీడియోలు, పోటోలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రూపు అడ్మిన్ బాద్యుడిగా పరిగణిస్తామన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

కోటపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కోటపల్లి మండల నూతన బీజేపీ కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ మండల అద్యక్షురాలుగా పెద్దింటి స్వప్న, ఉపాద్యక్షులుగా లచ్చన్న, తిరుపతి, కె. అమృత, ఇప్ప సంపత్, ప్రధాన కార్యదర్శులుగా కందుల వెంకటేశ్వర్, వడ్లకొండ రాజేష్, కార్యదర్శులుగా జనగామ రామయ్య, సరస్వతి, సంధ్య, నవీన్, ట్రెజరర్‌గా గడిపెల్లి బాపుతో పాటు సభ్యులను ఎన్నిక చేసినట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోటపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ బైపీసీ ఆంగ్ల మాధ్యమంలో తరగతులు బోధించడానికి తాత్కాలిక పద్ధతిలో అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధి కారిణి హరిత పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీష్, బోటనీ, జువాలజీ, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో బోధించడానికి సంబంధిత సబ్జెక్టులలో పీజీ బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు ఈ నెల 12,13 తేదీల్లో పాఠశాలలో వారి ఒరిజినల్ విద్యార్హతల ధృవీకరణ పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

ప్రభుత్వ కార్యాలయాలకు

పక్కా భవనాలు కరువు



ఫారెస్టు సెక్షన్ కార్యాలయ భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

- పట్టించుకోని ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

భీమారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేకపోవడంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయం, తహ సీల్దార్ కార్యాలయాలు తాత్కాలికభవనాల్లో కొనసాగుతుండడంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిపంచాయతీ కార్యాలయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు కూడా దూరంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పాఠశాలల్లో, అద్దె భవనాల్లో పంచాయతీ కార్యాలయాలు..

గత ప్రభుత్వం కొత్తపల్లి గ్రామపంచాయతీకి భవనం నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే పనులను నిలిపివేయడంతో ఇప్పటికీ పంచాయతీ కార్యాలయ భవనం పూర్తి కాలేదు. గ్రామపంచాయతీల ను అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఖాజీపల్లి, నర్సింగాపూర్, ధర్మారం, దాంపూర్, ఆరేపల్లి, ఎల్కేశ్వరం గ్రామపంచాయతీలకు సరైన భవనాలులేక పాఠశాలల భవనాల్లో కొనసాగిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పోలంపల్లి గ్రామపంచాయతీ ఏర్పడి ఏళ్ల గడుస్తున్నా సొంత భవనంలేక అటవీశాఖ వన సంరక్షణ సమితి ద్వారా నిర్మించిన కమ్యూనిటీ హాలులో పంచాయతీ భవనం కొనసాగుతోంది. కార్యాలయాలు దూరంగా ఉండడంతో ఇబ్బంది లు పడుతున్నారు. ప్రజలకు చేరువలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించేలా ప్రభుత్వం, ఎమ్మెల్యే కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● ప్రభుత్వ కార్యాలయాలకు లేని సొంత భవనాలు

ఎమ్మెల్యే బాల్క సుమన్, ఈ ప్రాంత నాయకుల కృషితో భీమారం మండలాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2016లో జైపూర్ ఉమ్మడి మండలం నుంచి 9గ్రామపంచాయతీలతో భీమారం మండలాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నూతన మండలాలకు జనాభా ప్రతిపాదికన కొత్తపంచాయతీలను ఏర్పాటు చేయగా మండలంలో మరో2 గ్రామపం చాయతీలు ఏర్పడ్డాయి. మొత్తం 11 గ్రామపంచా యతీలతో మండలం ఏర్పడింది. మండలానికి కావాల్సిన పాలనపరమైన, అధికారులకు సంబం ధించిన నూతన భవనాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది. దీంతో ఎంపీడీవో కార్యాలయం భీమారం గ్రామపంచాయతీ కార్యాలయంలో కొనసాగుతోంది. తహసీల్దార్ కార్యాలయం సహకారసంఘం భవనంలో కొన్నాళ్ల కొనసాగింది. భారీ వర్షాలతో నీరుకారడం, పెచ్చులూడడంతో మూడేళ్లక్రితం ఫారెస్టు సెక్షన్ కార్యాలయంలో తాత్కాలికంగా తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి కొనసాగిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి ప్రతిరోజు పెద్దసంఖ్యలో రైతులు, విద్యార్థులు, ప్రజలు తమ అవసరాల నిమిత్తం వస్తున్నా కార్యాలయానికి సొంత భవనంలేక, సరైన సౌకర్యాలులేక పోవడంతో కార్యాలయానికి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సగానికి పైగా గ్రామపంచాయతీ కార్యాలయాలు ప్రభుత్వపాఠశాలల్లో కొనసాగుతున్నాయి. 10ఏళ్ల నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలులేక తాత్కాలిక భవనాల్లో కొనసాగుతుండడంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పక్కా భవనాలు నిర్మించాలి



మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కా ర్యాలయాలకు వెళితే సౌకర్యాలు లేక ఇబ్బందులు ప డుతున్నాం. కార్యాలయాలు కూడా దూరంగా ఉండడంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను గుర్తించి ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి.

- గాలిపెల్లి నాగభూషన్

ప్రభుత్వానికి నివేదికలు అందిస్తాం..

భీమారం మండలం ఏర్పడి 10 సంవత్సరాలు అవు తున్నా సొంత భవనాలు లేక ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలతో కూడిన నివేదికలు అందించాం. పంచాయతీ భవనాలకు, కార్యాలయానికి సొంత భవనాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పక్కా భవనాలు ప్రారంభిస్తాం.

- మధుసూదన్, ఎంపీడీవో

రైతన్నా.. జర భద్రం

(5వ పేజీ తరువాయి)

అనుమానం వస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి. అనుమానం ఉన్న ఎరువులను పరీక్షలకు పంపించేలా అధికారులకు ఫిర్యాదు చేయాలి.

● పురుగు మందులపై అవగాహన అవసరం..

చీడపీడల నివారణకు వాడే క్రిమిసంహారక మందుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వ్యవసాయశాఖ సూచించే మందులను కొనాలి. నిషేదిత మందుల జోలికి వెళ్లొద్దు. లైసెన్సు లేని దుకా ణాల నుంచి కొనవద్దు. అవసరానికి మించి కొని నిల్వ చేసుకుంటే మందులు చెడిపో తాయి. లేబుల్ లేని మందుసీసా, ప్యాకెట్, డబ్బాలను కొనరాదు. లేబుల్ మీద ప్రకటించిన మందు పేరు, రూపం, మందుశాతం, పరిమాణం, విష ప్రభావం, తెలిపే గుర్తులు, వాడకంలో సూచనలు, జాగ్రత్తలు, విరుగుడు మందులు, బ్యాచ్ నంబరు, వాడాల్సిన గడువు, తయారు చేసిన సంస్థ పేరు, రిజిస్ట్రేషన్ విషయాలు పరిశీలించాలి. మందుల విషపూరిత స్థాయిని తెలిపేందుకు డైమాండ్ ఆకారంలో తెలుపుతో మరో రంగు వినియోగిస్తారు. వాటి వర్గీకరణను బట్టి విషస్థాయిని అంచనా వేసుకోవచ్చు. ఎరుపు రంగు ఉంటే అత్యంత విషపూరితం. పసుపు రంగు అతి విషపూరితం. నీలి రంగు విషపూరితం, ఆకు పచ్చ రంగు స్వల్ప విషపూరితం అని అర్థం చేసుకో వాలి.

రైతులకు ముందు జాగ్రత్త అవసరం

డాక్టర్ కోట శివకృష్ణ,

కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్, బెల్లంపల్లి



విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోళ్ల సమయంలో రైతులకు ముందు జాగ్రత్త అవసరం. తక్కువ ధరకు వస్తున్నాయని ఎట్టి పరిస్థితుల్లో లూజు విత్తనాలు కొనకూడదు. మధ్య దళారుల మాయమాటలు నమ్మి మోసపోవద్దు. కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్‌పై వివరాలను సరి చూసుకోవాలి. తయారీ తేది, లాట్ నంబరు, ఎక్స్‌పైరీ డేటులను చూసి వాటిని రసీదుపై రాయించుకోవాలి. విత్తనాల ఖాళీ ప్యాకెట్లు, సంచులు, రసీదులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచి ఉంచాలి. సరిగ్గ మొలవక పోవడం, దిగుబడి రాకపోవడం లాంటి సమస్యలు వస్తే కంపెనీ నుంచి పరిహారం పొందవచ్చు. నిపుణుల సూచన మేరకు తగిన మోతాదులోనే పిచికారి చేయాలి. రైతుల ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

వ్యాపార కమిటీ ఎన్నికల నిర్వహణ ఎప్పుడు..?

మందమర్రి టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి పట్టణ వ్యాపార కమిటీ ఎన్నికల కాల పరిమతి ముగిసి రెండు సంవత్సరాలు కావస్తుంది. అయినా ఎన్నికల నిర్వహణ లేకపోవడంతో సమస్యల పరిష్కారం కావడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. పట్టణ వ్యాపార కమిటీ అధ్యక్షుడిగా తమ్మిశెట్టి విజయ్ కొనసాగుతున్నారు. అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్నారు. అయినా ఎన్నికల వెనుక జాప్యం ఏమిటని, కారుకులెవరని కూడా పలువురు వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. గత పాలక వర్గం కాల పరిమితి ముగిసి రెండు సంవత్సరాలు అవుతున్నా ఎందుకు నిర్వహించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు జరపాలని మెజారిటీ వ్యాపారులు కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

భీమారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి గోపాల్‌రావు పేర్కొన్నారు. మంగళవారం భీమారంలోని విద్యావనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులకు, కుక్ కం హెల్పర్లకు శానిటేషన్ సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన సంతులిత ఆహారం అందించాలని ఉద్దేశ్యంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి మండలంలోని అన్ని పాఠశాలల పరిసరాలను, తరగతి గదులను శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ అప్పారావు, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లుతో పాటు ప్రధానోపాధ్యాయులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పారిశుధ్య కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

మంచిర్యాలకలెక్టరేట్, జూన్10 (ఆంధ్రజ్యోతి): గత నస్పూర్ మున్సిపాలిటిలో పని చేసిన పారిశుధ్య కార్మికులను పనుల్లోకి తీసుకోవాలని కోరుతూ నస్పూర్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు మంచిర్యాల కార్పొరేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గత నస్పూర్ మున్సిపాలిటిలో పనిచేసిన 120 మందిని తీసివేసిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు ఓవర్‌హెడ్ మంచినీటి ట్యాంక్‌లు బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయాలన్నారు. అమృత్ వాటర్ ట్యాంక్ నిర్మాణాల కోసం తవ్విన గుంతల దగ్గర ఎలాంటి రక్షణ చర్యలు లేవని వాటిని వెంటనే నిర్మించాలన్నారు. గత నస్పూర్ మున్సిపాలిటిలో డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా వార్డు పరిధిలో దాదాపుగా రెండు ట్రాలీలు, మొత్తం 41 ట్రాలీలు నస్పూర్ మున్సిపాలిటిలో పెట్టడం జరిగిందన్నారు. అందులో ఉన్న ట్రాలీలు నిరుపయోగంగా ఉన్నాయని వాటిని రిపేర్ చేయాలన్నారు. డ్రైవర్లను కూడా వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. నస్పూర్ మున్సిపాలిటి పరిధిలో ఎల్ఈడీ లైట్స్ చాలా పని చేయడం లేదన్నారు. వెంటనే వాటిని రిపేర్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ ఎంపికలో అవకతవకలు జరిగాయని, అర్హులైన పేదవారికి అందే విధంగా చూడాలన్నారు. మిషన్ అమృత్ పథకం కింద వాటర్ ట్యాంక్‌లు కట్టే ప్రక్రియలో పెద్ద ఎత్తున మట్టి తీయడం జరిగిందని, ఒక వేళ వర్షాలు చిన్ని పిల్లలు అందులో పడే అవకాశాలు ఉన్నాయని ముందు జాగ్రత్తగా కంచే ఏర్పాటు చేయాలని కోరారు.

హైదరాబాద్‌కు బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలి



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి, జూన్10 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు కాంగ్రెస్ నాయకులు విన్నవించుకున్నారు. ఇటీవల కొన్ని రోజులుగా బెల్లంపల్లిలో రైల్వే మూడవ లైన్ నిర్మాన పనులు చేపడుతున్నారని, దీంతో భాగ్యనగర్‌తో పాటు ఇతర రైల్లు హైదరాబాద్‌కు వెళ్లేవి రద్దయ్యాయన్నారు. హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా బెల్లంపల్లి నుంచి ప్రత్యేక బస్సులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. నాయకులు మల్లయ్య, నాతరి స్వామి, బండి రాము పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు నడుపాలి

బెల్లంపల్లి, జూన్10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడుపాలని ఎంసీపీఐయూ పార్టీ జిల్లా కార్యదర్శి నబ్బని రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైల్వే మూడో లైన్ పనులు చేపడుతున్న సందర్భంగా పలు రైల్లు బెల్లంపల్లికి రాకుండా మంచిర్యాల వరకే వస్తున్నాయన్నారు. స్థానిక ప్రయాణికుల సమస్యను ఎమ్మెల్యేతో పాటు ఆర్టీసీ అధికారులు దృష్టిలో పెట్టుకొని బస్సులు నడుపాలని పేర్కొన్నారు. నాయకులు పసులేటి వెంకటేశ్, రాహుల్, ఆకాశ్‌లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను అర్హులకు అందజేయాలి

బెల్లంపల్లి,జూన్10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైనవారికి అందజేయాలని బీజేపీ జిల్లా ప్రదాన కార్యదర్శి పట్టి వెంకటక్రిష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో గజెల్లి రాజుకుమార్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రాములు, నగేశ్, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్, రఘు, గంగారాం, కార్యదర్శులుగా సాయి, రాజేశ్, ఈశ్వర్‌లు ఎంపికయ్యారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోటపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 6 నుంచి ఇంటర్ వరకు ఖాళీగా ఉన్న సీట్లల్లో ప్రవేశాలకు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్ బాలికలకు ఉచిత హాస్టల్ వసతి ఉంటుందని, ఈ నెల 13లోగా నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పంట సాగులో రైతులకు చేయూత అందిస్తాం

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలకలెక్టరేట్, జూన్10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంట సాగుల రైతులకు అవసరమైన సాగునీరు, పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు, ఇతర అన్ని విధాలుగా చేయూత అందిస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంల మంచిర్యా ల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతిలతో కలిసి మండల వ్యవసాయ అధికారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, బ్యాంక్ అధికారులు, ఫర్టిలైజర్ షాపుల యజమానులు, రైతులతో వానాకాలం వ్యవసాయ సాగు సంసిద్ధత సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలంలో పంట సాగులో రైతులు అవసరమైన మెళకువలు అందిస్తామన్నారు. అర్హత గల ప్రతి రైతుకు అవకాశం ఉన్న ప్రతి అంశంలో రాయితీ రుణాలు అందించేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. బ్యాంకర్లు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ లక్షెట్టిపేట చైర్మన్ ప్రేమ్ చంద్, అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్ మెంట్ ఏజెన్సీ ప్రతినిధి సింగతి మురళీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

భూభారతికి 105 దరఖాస్తులు

నెన్నెల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండ లంలో భూభారతి రెవెన్యూ సదస్సులు కొనసాగు తున్నాయి. మంగళవారం మూడు గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. గుండ్లసోమారంలో 50, కోనంపేటలో 49, పుప్పాల్‌వానిపేటలో 6 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ మహేంద్రనాథ్ తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. డిప్యూటీ తహసిల్దార్ ప్రకాష్, ఎంఆర్ ఐ సులోచన తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: భూ భారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యలు పరిష్కరం అవుతాయని దండేపల్లి తహసీల్దార్ రోహత్ దేశపాండే సూచించారు. దండేపల్లి మండలం గూడెం, నాగసముద్రంలోని మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ మాధవి, సీనియర్ అసిస్టెంట్ ముత్తె లావణ్య, ఆర్ఐ బొద్దుల భూమన్న పాల్గొన్నారు.

పాఠశాలల స్కావెంజర్లకు శిక్షణ

లక్షెట్టిపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే స్కావేంజర్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి యాదయ్య హాజరై మాట్లాడుతూ పాఠశాలల్లో పారిశుధ్య పనులు ప్రతీ రోజు సక్రమంగా నిర్వహించాలని అదేశించారు. వందకు 90శాతం వ్యాధులు అపరిశుభ్రతతోనే వస్తాయన్న విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి శైలజ, సెక్టోరియల్ అధికారి చౌదరితో పాటు వివిధ పాఠశాలల ప్రదానోపాధ్యాయులు, స్కావెంజర్లు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం

ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్స్ శాంతారాం

నస్పూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణులను రక్షించడంతో పాటు పునరావాసం కల్పించడం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తున్నమని ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్స్ (ఎఫ్‌డీపీటి) శాంతారాం అన్నారు. నస్పూర్ పట్టణం సీసీసీలోని అతిథి గృహంలో మంగళవారం వన్యప్రాణుల, పునరావాసం పై తెలంగాణ లోని వివిధ జిల్లాలకు చెందిన అటవీ శాఖ క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణ తరగతుల కార్యక్రమం నిర్వహించారు. వీరందరికి వన్యప్రాణులను ఏలా రక్షించడానికి పాటించాల్సిన పద్ధతులను నిపుణులచే శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైనా ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్స్ శాంతారాం మాట్లాడుతూ వన్యప్రాణులను రక్షించడంలో మెలకువలు నేర్చుకుని వాటిని కాపాడుకోవాల్సిన వసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్, వెటర్నరీ సర్జన్ డాక్టర్ నవీన్, మంచిర్యాల ఎఫ్ఆర్‌వో రత్నాకర్, రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన అటవీ శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్స్ శాంతారాం

బడి బాటను విజయవంతం చేయాలి

చెన్నూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని సుబ్బరాంపల్లి, కత్తెరసాల గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల గురించి వివరించారు. పిల్లలందర్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, మహేందర్, రాజమల్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేమనపల్లి : బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఎంఈవో శ్రీదర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేమనపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కుక్ కం హెల్పర్లు విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన మధ్యాహ్న భోజనం వండాలని పేర్కొన్నారు. ఎంపీడీవో కుమారస్వామి, ఆర్‌పీ శంకర్, ఎంఐఎస్ సుజాత, సీఆర్‌పీలు అశోక్, వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి విద్యాను అందిస్తున్నామని మీ పిల్లలను సర్కార్ బడిలో చదివించాలని వెల్గనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి కోరారు.

నంబాలలో మంగళవారం వెల్గనూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భీమారం : రైతులు పచ్చిరొట్టె వాడి నత్రజని శాతాన్ని పెంచుకునేందుకు కృషి చేయాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

నెన్నెల : వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సబ్సిడీ జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పుప్పాల సృజన తెలిపారు.

తాండూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా గురువు యాత్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం యోగా విద్యార్థులు పాఠశాల ఆవరణను శుభ్రం చేసి మొక్కలు నాటారు. వేణు, వినయ్, మహేష్, రామకృష్ణ, విష్ణు, లక్ష్మణ్, సాయిరాం పాల్గొన్నారు.

●తాండూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో 50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సుష్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోటపల్లి: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, సిర్సా, దేవులవాడ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం క్లస్టర్ల వారీగా మధ్యాహ్న భోజన కార్మికులకు, పారిశుద్య కార్మికులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, మొగిలి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : పంపిణీకి జీలుగ విత్తనాలు సిద్దంగా ఉన్నాయని రైతులు తీసుకువెళ్లాలని మండల వ్యవసాయాధి కారిణి కిరణ్మయి పేర్కొన్నారు. మంగళవారం సహకార సంఘం కార్యాలయంలోని జీలుగ విత్తనాలను పరిశీలించారు.

మందమర్రిరూరల్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు చేరాలని కోరుతూ అధ్యాపకులు మంగళవారం మండలంలోని గ్రామాల్లో తిరుగుతూ ప్రచారం చేశారు. అధ్యాపకుడు రామయ్య మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: జాతీయ బీసీ విద్యార్థి బీసీ సంఘం జిల్లా అధ్యక్షులుగా రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన నితీష్ నియమించినట్లు జిల్లా అధ్యక్షులు పూదరి చంద్ర మోహన్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ విద్యార్థి సంఘం హక్కుల కోసం కృషి చేయనున్నట్లు నితీష్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంచిర్యాల జిల్లా వార్తలు

5

బుధవారం 11 జూన్ 2025





సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి వివేక్

సీఎంను కలిసిన మంత్రి వివేక్,ఎంపీ వంశీ

మందమర్రిటౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఢిల్లీలోని ఆయన నివాసంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఆయన తనయుడు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు వెళ్తుందని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని, ఆ రాష్ట్రాలు కూడా పథకాలు అమలుకు కృషి చేస్తున్నారన్నారు. మంత్రిగా తనకు ఏశాఖ ఇచ్చినా సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా విజయం సాధించేది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థు లేనని తెలిపారు.

రైతన్నా.. జర భద్రం

- విత్తనాలు.. ఎరువుల కొనుగోళ్లలో జాగ్రత్త
- ప్రకటనలు చూసి మోసపోవద్దు
- నకిలీలతో అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచన
- వానాకాలం ప్రారంభంతో కొనుగోళ్లలో రైతులు బిజీ



నెన్నెలలో విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు



నెన్నెల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమకు ఫలితం దక్కాలంటే.. ఆది నుంచి అన్నదాత అప్రమత్తంగా ఉండాలి. దుక్కిదున్నింది మొదలు పంట చేతికొచ్చే వరకు సాగుకు సంబంధించి జాగ్రత్తలు పాటించాలి. పంటకు అవసరమయ్యే ప్రతీ వస్తువు కొనుగోలులో.. చేసే ప్రతి పనిలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా పంట దిగుబడి, పంట కాలం వృథా అయ్యే ప్రమాదంతో పాటు రైతులు అప్పుల పాలయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల కొనుగోళ్లలో అత్యంత జాగ్రత్త అవసరం. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు సూచనలతో ముందుకు సాగాలి. విత్తన ఎంపిక నుంచి పంట దిగుబడి పొందే వరకు శాస్త్రీయంగా సేద్యపు పద్ధతులు అవలంబించడంతో పాటు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటేనే అన్నదాత పడ్డ ఆరుగాలం శ్రమకుతగ్గ ప్రతిఫలం దక్కుతుందని అధికారులు సూచిస్తున్నారు.

విత్తనాలు కొనే ముందు జాగ్రత్త...

దళారుల మాయమాటలు నమ్మినకిలీ, లూజు విత్తనాల జోలికి వెళ్లొద్దు. ప్రైవేటు విత్తన సంస్థలు పెద్ద ఎత్తున చేసే ప్రచారానికి ఆకర్షితులై విత్తనాలు కొనుగోలు చేయవద్దు. విత్తనాన్ని ఎంచుకునే ముందు వ్యవ సాయాధికారి, శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవడం మంచిది. మార్కెట్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేసిన విత్తనాలు ఉంటే వాటినే తీసుకోవడం ఉత్తమం. లైసెన్సు పొందిన అధికృత డీలరు నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. సరిగా సీల్‌చేసిఉన్న ప్యాకెట్లు, బస్తాలను ధృవీకరణ పత్రం (ట్యాగ్) ఉన్న వాటినే ఎంపిక చేసుకోవాలి. బస్తా, ప్యాకెట్‌పై గడువుతేది, రకంపేరు, లాట్ నంబర్లను గమనించాలి. కొనుగోలు బిల్లుతో పాటు నంబరు, విత్తనరకం, గడువుతేది పేర్కొనేలా డీలరు సంతకంతో కూడిన రసీదు పొందాలి. రసీదును పంటకాలం పూర్తి అయ్యే వరకు భద్ర పర్చుకోవాలి. రైతు సంతకం కూడా బిల్లుపై ఉండేలా చూసుకోవాలి.

● ఎరువులు కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి..

పంటల అధిక దిగుబడికి రసాయన ఎరువులు దోహదం చేస్తాయి. నాన్యమైన ఎరువులనే వాడాలి. అక్కడక్కడ కొందరు దళారులు నాసీరకం ఎరువులను విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నారు. ఫలితంగా అమాయక రైతులు పెట్టుబడులు సైతం నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని మెలుకువలు పాటిస్తే నకిలీలను నివారించే ఆస్కారం ఉంది. లైసెన్సు ఉన్న దుకాణంలోనే ఎరువులను కొనాలి. కొనుగోలు చేసిన ఎరువులకు సరైన బిల్లులు పొందాలి. బిల్లును జాగ్రత్తగా భద్రపర్చుకోవాలి. డీలర్ బుక్కులో రైతు విధిగా సంతకం చేయాలి. మిషన్ కుట్టు ఉన్న ఎరువుల బస్తాను మాత్రమే కొనాలి. బస్తాపై ప్రామాణిక పోషకాలు, ఉత్పత్తిదారుల వివరాలు ఉండాలి. బరువులో అనుమానం వస్తే తూకం వేయించాలి. చిరిగిన, రంధ్రాలున్న బస్తాలను తిరస్కరించాలి. ఖాళి సంచులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చాలి. ఇటీవల రైతులు సూక్ష్మ పోషకాలపై ఆసక్తి చూపిస్తున్నారు. ఆందమైన ప్యాకింగులకు ఆకర్షితులు కాకుండా ఆధికారులు సిఫారసు మేరకు కొంటే మంచిది. కొనుగోలు చేసిన ఎరువుల విషయంలో ...

(తరువాయి 7లో)

ప్రజల వద్దకే వైద్య శిబిరాలు...

● జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎల్. సుధాకర్ నాయక్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నస్పూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయుష్మాన్ భారత్ మిషన్, భారత్ అభియాన్ ఇంటి గ్రేటెడ్ హెల్త్ క్యాంపుల్లో భాగంగా ప్రజల వద్దకే వెళ్లి వైద్య శిబిరాలు నిర్వ హించేందుకు శ్రీకారం చుట్టారు.. జిల్లాలో 100 రోజులు పాటు నూరు శిబి రాలను నిర్వహించి క్షయ రహిత సమాజ నిర్మాణానికి వైద్య సిబ్బంది అధికారులు ప్రజల చెంతకు తరలివెళ్లనున్నారు. క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రజల సహ కారంతో కృషి చేస్తామని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ వెల్లడిం చారు. ఆయనతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ...

ఆంధ్రజ్యోతి : క్షయవ్యాధి లక్షణాలు ఏలా ఉంటాయి..?

డాక్టర్ : రెండు వారాల కంటే ఎక్కువ రోజులు దగ్గు ఉన్నట్లయితే క్షయగా అనుమానించి పరీక్షలు చేయించాలి. అందుబాటులో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లి సమస్య చెబితే తెమడ పరీక్ష చేస్తారు. మందులు ఇస్తారు, పొగ, చుట్టా తాగడం, మద్యం సేవించే వారిలో ఎక్కువ మందిలో లక్షణాలు ఉంటాయి. మరి కొందరిలో ఆకలి మందగించడం, సన్నగా ఉండి శరీరం బలహీనంగా ఉన్న వారిలో ఎక్కువ వ్యాధి చెందుతుంది. వారిని గుర్తించి పరీక్షలు చేసి మందులు ఇచ్చి జాగ్రత్తలు చెబుతున్నాము.

ఆంధ్రజ్యోతి : జిల్లా వ్యాప్తంగా ఎంతమంది క్షయ వ్యాధి గ్రస్తులున్నారు..?

డాక్టర్ : జిల్లాలో క్షయ వ్యాధి బారిన పడిన వారిని గుర్తించి వ్యాధి వ్యాప్తిని నియంత్రిం చాలనే ఉద్దేశ్యంతో జిల్లాలో 100 రోజుల పాటు నూరు వైద్య శిబిరాలు నిర్వహించనున్నాము. ఇప్పటి వరకు నిర్వహించిన ఐదు శిబిరాల్లో చేసిన పరీక్షల్లో ఐదు పాజిటివ్ కేసులు వచ్చాయి. మందులు పంపిణీ చేశాం.

ఆంధ్రజ్యోతి : ఏలాంటి సౌకర్యాల కల్పిస్తున్నారు..?

డాక్టర్ : పరీక్షల కోసం వచ్చే వారిని అన్ని పరీక్షలు శిబిరంలోనే చేసి ఎక్స్‌రే అవసరమైతే 102 వాహనం ద్వారా అందుబాటులోని జనరల్ అసుపత్రికి తరలిస్తున్నాము. పరీక్షలు పూర్త యిన వెంటనే అదే వాహనంలో తిరిగి తీసుకువస్తున్నాం. పట్టణ ప్రాంతాలకు ఏరియా అసుపత్రులు అందుబాటులో ఉన్నందున పరీక్షలకు అక్కడి పంపుతున్నాము. గ్రామీణ ప్రాంతాల్లో అయితే డిజిటల్ ఎక్స్ రే మిషన్(చిన్నది) శిబిరంలో ఉంటుంది. ప్రతి ఒక్కరు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

సేవాభావంతో పని చేయాలి

● ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రమణ

మంచిర్యాల కలెక్టరేట్, జూన్10 (ఆంధ్రజ్యోతి): సంతాన సాఫల్య కేంద్రాలు సేవాభావంతో పని చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూజారి రమణ పేర్కొన్నారు. మంగళవారం బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఓయాసిస్ సంతాన సాఫల్య కేంద్రం ఉచిత పరీక్షలు, మందుల పంపిణీని ప్రారంభించారు. మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓయాసిస్ ఫర్టిలిటి సెంటర్ జనని యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మొబైల్ బస్సును ఏర్పాటు చేసి గ్రామీణ, పట్టణ ప్రజలకు శాస్త్రీయ వైద్యం అవగాహన కల్పించారు. ఐఎంఏ అధ్యక్షులు రమణ మాట్లాడుతూ ఫర్టిలిటి కేంద్రాలు సేవాభావంతో పని చేయాలన్నారు. మాతృత్వం కోసం ఎదురు చూస్తున్న దంపతులకు ఈ సేవలు ఎంత గానో సహాయపడుతాయన్నారు. అనంతరం సీనియర్ గైనకాలజిస్టు సమతారాఘవరావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వైద్య చికిత్సపట్ల సమాన్య ప్రజలకు సేవలు అందుబాటులో ఉంచే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓయాసిస్ ఫర్టిలిటి వైద్యులు, పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై పోలీసుల తనిఖీలు



జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీపీ, పోలీసులు

కోటపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్‌లో మావోయిస్టు సభ్యులు మృతిచెందినందుకు నిరసనగా మంగళవారం మావోయిస్టులు ఇచ్చిన బంద్ పిలుపు మేరకు మండలంలోని 63వ నెంబరు జాతీయ రహదారిపై జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. పారుపెల్లి సమీపంలోని చెక్‌పోస్టు వద్ద మహా రాష్ట్ర నుంచి ఇటు వైపు, ఇటు వైపు నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. అపరిచిత వ్యక్తుల సమాచారం తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు సీఐ దేవేందర్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్, ట్రైనీ ఎస్ఐ సుబ్బారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మండల్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి



పోస్టుకార్డులు పంపిణీ చేస్తున్న బీసీహక్కుల పోరాట సమితి

మంచిర్యాలకలెక్టరేట్, జూన్10 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ దగ్గరలో ఉన్న పోస్టు ఆఫీసులో మండల్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని మంగళవారం బీసీహక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రధాని మోదీకి పోస్టు కార్డులు పంపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1978లో అప్పటి ప్రభుత్వం బీసీలకు న్యాయం చేకూర్చాలని ఉద్దే శంతో బీపీ మండల కమిషన్ చేర్పాటు చేశారు. 1978లో కమిషన్ వేస్తే 1980 లో40 అంశాలతో కూడిన నివేదిక ఇచ్చారని 40ఏళ్ల దాటుతున్న ఒక్క అంశం సిఫారసులు మినహా ఏఒక్కటి అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైన సిఫారసులపై కేంద్రం దృష్టిసారించి పరిష్కరించి బీసీలకు న్యాయం చేయా లని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర నాయ కులు గజెల్లి వెంకట య్య, జిల్లా కార్యదర్శి శాకపురి భీం సేన్ చెలిమల అంజన్న, వేముల అశోక్ కీర్తి, బిక్షపతి, సతీష్, శంకర్, సత్తయ్యలు పాల్గొన్నారు.

ఉచిత విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు
- 12న పాఠశాల, కళాశాల నూతన భవనాల ప్రారంభం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

లక్షెట్టిపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నియోజికవర్గ ప్రజలకు ఒక్క పైసా ఖర్చు లేకుండా కార్పొరేటుకు దీటుగా ఉచిత విద్య, వైద్యం రెండు అందించడమే లక్ష్యం అని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. ఈనెల 12వ తేదీన లక్షెట్టిపేట పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ప్రభుత్వ కళాశాల, పాఠశాల భవనాల ప్రారంభోత్సవం సందర్బంగా మంగళవారం ఎమ్మెల్యే సంబంధిత అధికారులు, నాయకులతో కలిసి వాటిని పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రారంభోత్స వానికి ప్రతీ ఒక్కరూ తప్పకుండా రావాలని ముఖ్యంగా ఇందులో చదివిన పూర్వవిద్యార్థులు ఈభవనాల ప్రారంభోత్సవంలో పాలు పంచుకోవాలని కోరారు. తాను ఇదే పాఠశాలలో 1974వ సంవత్సరంలో విద్యను అభ్యసించిన సందర్బంగా అప్పటి జ్ఞాప కాలను తన స్నేహితులు, అధికారులకు గుర్తు చేసారు. ఉపాధ్యాయులు సైతం మన ప్రాంతంలోని వివి ధ పాఠశాలల విద్యార్థులను పెద్ద సంఖ్యలో తీసుకురావాలని ఏటా ఇందులో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. గతంలో ఉన్న కళాశాల, పాఠశాల కాదని ఇక్కడ ఇప్పుడు అన్నిరకాల వసతులతో పాటు అధునాతనమైన ల్యాబ్‌లు, అనుభవం కలిగిన పూర్తిస్థాయిలో సిబ్బందిని కూడా నియమించినట్లు తెలిపారు. తాను గెలిచిన తర్వాత తను చదువుకున్న పాఠశాల, కళాశాలను నిర్మించే భాగ్యం తనకు లభించడం అదృష్టంగా బావి స్తున్నానన్నారు.

ఈకార్యక్రమంలో జిల్లా విద్యాధి కారి యాదయ్య, డీఐవో ప్రభాకర్, ఎంపీడీ వో సరోజ, ఎమ్మార్వో దిలీప్‌కు మార్, ప్రిన్సిపల్స్ రమాకళ్యాణి, లక్ష్మణ్‌రావుతో పాటు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆరీఫ్, మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, ఆర్టీఏ మెంబర్ అంకతి రమేష్, జిల్లా నాయకులు అశోక్, పూర్ణచందర్‌రావు, త్రిమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

మంచిర్యాలకలెక్టరేట్, జూన్10 (ఆంధ్ర జ్యోతి): ఈ నెల 21, 22న నిర్వహించే సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్ అన్నారు. ఈ సమావేశం సీపీఐ ఇల్లా సమితి సభ్యులు కొట్టే కిషన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్బంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్ మాట్లాడుతూ 21న ప్రద ర్శన, బహిరంగ సభ, 22న ప్రతినిధులు సభ నిర్వ హిస్తామన్నారు. ఈ సభలలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశి వరావు, ఎంఎల్ఏ, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, మిట్టపల్లి వెంకటస్వామి, చంద్రశేఖర్, వీరభ ద్రయ్య, అలీఖాన్, లింగం రవి, నగేశ్, శ్రీనివాస్, సమ్మయ్య, చంద్ర కళ, పౌలు పాల్గొన్నారు.

శిక్షణ భృతి కోసం దరఖాస్తు చేసుకోండి

మంచిర్యాలకలెక్టరేట్, జూన్10 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాలకు చెందిన న్యాయశాస్త్ర పట్టభద్రులు శిక్షణభృతి, న్యాయశాస్త్ర గ్రంథాలు, ఇతర ఫర్నీచర్‌కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను అర్హులు 39 ఏళ్లలోపు న్యాయశాస్త్ర పట్టభద్రులకు మూడేళ్ల పాటు న్యాయ పరిపాలనలో శిక్షణ నిమిత్తం జిల్లాలోని లా ఆఫీసర్లకు అటాచ్ చేస్తారని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో నెలకు 3వేలు శిక్షణ భృతి, న్యాయశాస్త్ర గ్రంథాలు, ఫర్నీచర్ కొనుగోలు నిమిత్తం రూ.50 వేలు ఒకసారి మాత్రమే మంజూరు చేస్తారని తెలిపారు. అభ్యర్థులు షెడ్యూల్డ్ కులముల న్యాయశాస్త్ర పట్టభద్రులు బార్ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉండాలని, సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి లక్షా50వేలు, పట్టణ ప్రాంతాల వారికి 2లక్షల రపాయల లోపు ఉన్నట్లుగా మీ సేవా కేంద్రాల ద్వారా జారీ చేయబడిన ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా వివరాలతో ఈనెల 11వతేదీ నుంచి జులై31 తేదీలోపు ఆన్‌లైన్‌లో ఈపాస్ హెచ్‌టీటీపీ://తెలంగాణ ఈపాస్.సీజీజీ.జీఓ వి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9440628538, 9948019142 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

సాగుభూములపై దౌర్జన్యాలు మానుకోవాలి



రైతు సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి

కోటపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములపై అటవీశాఖ అధికారుల వేధింపులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఇవి మానుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకెరవి అన్నారు. మంగళవారం మండలంలోని రొయ్యలపల్లి, అర్జున గుట్ట గ్రామాల్లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏండ్ల తరబడి వ్యవసాయం చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్న రైతులపై అటవీ శాఖ అత్యుత్సాహాన్ని చూపిస్తూ రైతుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ మోదీ ప్రభుత్వం అటవీ భూములంటూ సాగు భూములపై ఆధారపడి జీవిస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టడం, ట్రాక్టర్లను గుంజుకుపోవడం, రైతులను బలవంతంగా వెళ్లగొట్టడం లాంటి చేష్టలకు పోతుందని ఈ దౌర్జన్యాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, అటవీ అధికారుల చెర నుంచి కాపాడాలన్నారు.

ఈ సమావేశంలో మత్స్య కారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బోడెంకి చందు, రజకవృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, నాయకులు సమ్మయ్య, వెంక టి, రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ విద్యాలయంలో వంట సిబ్బందికి శిక్షణ



నస్పూర్‌లోని కస్తూర్బా పాఠశాలలో వంట సిబ్బంది శిక్షణలో పాల్గొన్న సిబ్బంది, అధికారులు

నస్పూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ కస్తూర్బాగాంధీ విద్యాల యంలో మంగళవారం జిల్లాలోని 18 కేజీబీవిలు, మోడల్ స్కూల్స్‌కు చెందిన 84 మంది వంట సిబ్బందికి నూతన మెనూపై శిక్షణ ఇచ్చారు. కొత్తగా చేర్చిన వంటల్లో చామగడ్డ, కంద గడ్డ, క్యాప్సికం, సాయంత్రం అల్పాహారంలో వడలు, మైసూర్ బొండా, ఉల్లి పకోడి, పాయసం, ఎగ్‌బజ్జీ తదితర పోషక విలువలున్న కూరగాయాలని కొత్త వంటకాల్లో చేర్చారు. మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ లతో పాటు 15 రకాల ఆహార పదార్థాలను రుచిగా తయారు చేశారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో యశోధర, నస్పూర్ కేజీ బీవి పాఠశాల ప్రత్యేకాధికారి మౌనిక, రిసోర్స్ పర్సన్స్ సునిత, సుమన చైతన్య, షహనాజ్ బేగం, స్వప్న, తిరుమల, స్వర్ణ, భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక విద్యకు దూరం

- జిల్లాలో కానరాని పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు
- ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్న విద్యార్థులు

6

క్షయ వ్యాధి నిర్మూలనే ప్రధాన లక్ష్యం



విలేజ్ నస్పూర్‌లో వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

నస్పూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించి క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ అన్నారు. విలేజ్ నస్పూర్‌లోని పాత మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వైద్య శిబిరంలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పలువురిని పరీక్షించి ఎక్స్‌రే, తదితర పరీక్షలు చేశారు. శిబిరంలో పాల్గొన్న డాక్టర్ సుధాకర్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షయ రహిత సమాజం నిర్మాణంకోసం అందరి బాధ్యత అన్నారు. ప్రభుత్వాలు నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధి కారి వెంకటేశ్, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి రాము, హెల్త్ ఎడ్యూకేటర్ అల్లాడి శ్రీని వాస్, జిల్లా కో అర్డినేటర్ సురేందర్, ఎస్‌టీఐఎస్ కౌన్సిలర్ శ్రీలత, ఏఎన్ ఎంలు పుష్ప, అక్తర్ బేగం, స్వాతి, హెల్త్ అసిస్టెంట్ వెంకట్, ఆశా కార్యకర్త లు, అవుట్ రీచ్ వర్కర్లు పాల్గొన్నారు.